క్లుప్తంగా

నేడు విద్యుత్ ప్రజావాణి

దామెర : మండల కేంద్రంలో విద్యుత్ ప్రజావాణి సోమవారం నిర్వహిస్తున్నట్లు ఏఈ గుర్రం రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మండల కేంద్రంలోని ఏఈ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు సంప్రదించాలని కోరారు.

రేపు పీఏసీఎస్ ప్రత్యేక మహాసభ

దామెర: మండలంలోని ఊరుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ప్రత్యేక మహాజన సభ మంగళవారం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న మధ్యాహ్నం 2 గంటలకు చైర్మన్ బొల్లు రాజు అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి పాలక మండలి సభ్యులు, రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మండలంలో అక్రమంగా ఇసుక దందా



వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక దందా జోరుగా సాగుతోంది.మండలంలోని పలు వాగుల నుంచి ఇసుక తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. వాగుల్లోని నిర్మానుష్య ప్రాంతాల్లో గుంతలు తవ్వుతూ ఇసుకను తీసి జల్లెడ పట్టి సన్న ఇసుకపేరిట అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా వాగుల్లోని ఇసుకను కుప్పలుగా పోసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. వాగుల్లోని ఇసుకను తీయడం వలన చుట్టూ ప్రక్కల ఉన్న బావులు, బోర్లు ఎండిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాగుల్లోని ఇసుకను తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరామర్శ



ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటలో బీఆర్ఎస్ నాయకుడు బొల్లెబోయిన రవియాదవ్ తల్లి కేతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆదివారం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ రైతురుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రవియాదవ్‌తో మాట్లాడి ఓదార్చారు.

వాగుల్లో విచ్చలవిడిగా కోళ్ల వ్యర్థాలు



వేలేరు : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చికెన్ సెంటర్ల వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను సంచుల్లో నింపి గ్రామం చివరలో ఉన్న వాగుల్లో పడేస్తున్నారు. దీంతో చుట్టు ప్రక్కల ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కుళ్లిపోయిన కోళ్ల వ్యర్థాలు కుక్కలు తిని ఆ దారిగుండా వెళ్లే వాహనదారుల వెంటపడి కరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికెన్ సెంటర్ల యాజమానులు ఊరి బయట నిర్మించిన డంపింగ్ యార్డులో వ్యర్థాలు పడేయకుండా వాగుల్లో పడేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కనిపించిన 'ఆరుద్ర'



వేలేరు : గత కొన్ని రోజులుగా మండలంలో వర్షాలు కురవడంతో చల్లటి వాతావరణానికి ఆరుద్ర పురుగులు వస్తున్నాయి. ఇవి కనిపిస్తే వర్షాలు పుష్కలంగా కురుస్తాయని రైతుల నమ్మకం. ఆదివారం మండలంలోని పీచర గ్రామంలోని ఓ రైతు చేనులో ఆరుద్ర పురుగులు కనిపించాయి.

ప్రమాదాలకు కేరాఫ్ యూటర్న్‌లు

- ప్రాణాలు తీస్తున్న అతివేగం, అజాగ్రత్త
- ఇప్పటికే ముగ్గురి మృతి, పలువురికి గాయాలు
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్



యూటర్న్ వద్ద బోల్తా పడ్డ స్కూల్ బస్సు, పక్కనే నుజ్జునుజ్జయిన కారు (ఫైల్)

కమలాపూర్: అది హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారి. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ మార్గంలోనే ఉన్న కమలాపూర్ మండలంలోని కొన్ని యూటర్న్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోగా వాహనదారులు మద్యం సేవించి వాహనాలను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. యూటర్న్‌ల వద్ద ప్రమాదం జరిగిన ప్రతీసారి ఒకరు మృత్యువాత పడుతున్నారు.

యూటర్న్‌ల వద్ద ముగ్గురి మృతి..

మండలంలోని ఉప్పల్–భీంపల్లి, కన్నూరు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న యూటర్న్ వద్ద 2023 జనవరి 2న స్కూటీని హెచ్‌పీ గ్యాస్‌సిలిండర్ల లారీ ఢీకొన్న ప్రమాదంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం దుబ్యాలకు చెందిన బిక్కినేని సంపత్‌రావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య విజయతో పాటు అక్కడే బస్సుకోసం వేచి ఉన్న కన్నూరుకు చెందిన సుమలతకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే తోపుడు బండిపై పండ్లు అమ్ముకుంటున్న అంజలికి స్వల్ప గాయాలయ్యాయి. కమలాపూర్ హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద 2023 జూలై 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపూర్‌కు చెందిన తాపీమేస్త్రీ మామిండ్లపల్లి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తాజాగా కమలాపూర్‌లోని ఓ యూటర్న్ వద్ద జూన్ 27న సాయంత్రం ఓ కారు ఢీకొని 30 మంది విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సు బోల్తా పడగా ముగ్గురు విద్యార్థులకు స్వల్పగాయాలై ప్రాణాపాయం తప్పింది. కానీ కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే హుజూరాబాద్ మండలం కందుగులకు చెందినఎండీ.అబ్దుల్ మృతి చెందాడు.

ప్రాణాలు తీస్తున్న అతివేగం, అజాగ్రత్త..

వాహనదారులు మద్యం సేవించి వాహనాలు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతున్న కారణంగా అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఉప్పల్, కమలాపూర్‌లోని యూటర్న్‌ల వద్ద జరిగిన ప్రమాదాలతో సంబంధిత అధికారులు అక్కడి యూటర్న్‌లను మూసివేసి కొంత దూరంలో మరో చోట యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఆ యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి.



ప్రమాదకరంగా ఉన్న యూటర్న్ ఇదే

ఇప్పటికైనా యూటర్న్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని కోరుతున్నారు.

నివారణకు చర్యలు తీసుకోవాలి



అతివేగం, అజాగ్రత్త కారణంగా ఇప్పటికే కమలాపూర్ మండలంలోని యూటర్న్‌ల వద్ద జరిగిన ప్రమాదాలు ముగ్గురిని బలిగొనగా పలువురు గాయపడ్డారు. ప్రమాదాలు జరుగకముందే సంబంధిత అధికారులు స్పందించాలి.

– బచ్చల రంజిత్, రాములపల్లి

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం



ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ఆర్ అండ్‌బీ అధికారులతో మాట్లాడాం. యూ టర్న్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. ఏ వాహనం రావడం లేదని నిర్ధారించుకున్నాకే యూటర్న్ తీసుకోవాలి.

– హరికృష్ణ, సీఐ

సీఎం రాక..జిల్లా ప్రజల అదృష్టం

- మెగాటెక్స్‌టైల్ పార్కులో ఎంఓయూ కుదుర్చుకున్న కంపెనీలు
- పనులు వేగవంతానికి సీఎం చర్యలు
- పత్తి రైతులకు ప్రయోజనాలు
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పిలుపును ఆస్వాదించి రావడం జిల్లా ప్రజల అదృష్టంగా భావిస్తున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఎంఓయూతో కుదుర్చుకున్న కంపెనీలు మెగా టెక్స్‌టైల్ పార్కులో ఆయా కంపెనీలు మూడు నెలల్లో ప్రారంభించి స్థానికంగా ఉన్న వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం లభించినట్లు అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాలో పెద్ద పరిశ్రమ మెగా టెక్స్‌టైల్ పనులను పరిశీలించిన సీఎం ఎంఓయూ కుదుర్చుకున్న పలు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడినట్లు తెలిపారు. ఒప్పంద ప్రకారం మూడు నెలల్లో పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందని, ఆయా కంపెనీల్లో 80 శాతం స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని స్పష్టం చేయడం జరిగిందన్నారు. అయితే కొన్ని కంపెనీల ప్రతినిధులు స్థానికంగా ఉన్న చాలా మందికి తాము నెలకొల్పే పరిశ్రమలలో పనిచేయడానికి ప్రతిభలేనట్లు తెలుపగా అవసరమైతే జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా పత్తి దిగుబడిలో ఒంగోలుకు ఉన్న ప్రాధాన్యత వరంగల్‌కు ఇవ్వకపోవడంపై ఆరా తీయగా వరంగల్ నుంచి నాణ్యత లేదని స్పష్టం చేయగా నాణ్యత పెంచటానికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు రైతులను చైతన్యపర్చే కార్యక్రమాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. టెక్స్‌టైల్ పార్క్‌లో 1200 ఇళ్ల నిర్మాణ పనులు, రోడ్ల నిర్మాణ పనులు గత ప్రభుత్వం హయాంలో నిర్లక్ష్యం చేయబడ్డాయని, ఆయా పనులను వేగవంతంగా చేసేందుకు చొరవ తీసుకోవడం జరుగుతుందన్నారు. 50 నిమిషాల పాటు మెగా టెక్స్‌టైల్ పార్కు పనులను ముఖ్యమంత్రి సమీక్షించగా కొందరు ఇలా వచ్చి అలా వెళ్లిపోయారనడం అవివేకంగా ఉందన్నారు.

బిల్లులు రాకపోవడంతోనే పనుల్లో ఆలస్యం

పరకాల పట్టణంలో నిర్మాణంలో చేస్తున్న 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్‌కు రూ.10కోట్ల 50లక్షలకు ఒక్క బిల్లు కూడా గత ప్రభుత్వ అందించలేదన్నారు. అందుకే సదరు కాంట్రాక్టర్ పనులు చేపట్టలేకపోతున్నాడని, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. అదే విధంగా పరకాల మోడల్ మార్కెట్‌ను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కొంత ఆలస్యమైనా పెండింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు పరకాలను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో తాను ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ టి.స్వర్ణలత, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ పాడి కల్పనాదేవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్, మండల నాయకులు కొలుగూరి రాజేశ్వర్‌రావు, పావుశెట్టి వెంకటేశ్వర్లు, పసుల రమేష్, సదానందం, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో 'రైతుబంధు' దుర్వినియోగం



మహాసభలో మాట్లాడుతున్న డీసీఓ నాగేశ్వర్‌రావు

ఆత్మకూరు: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతు బంధు పథకం దుర్వినియోగమైందని పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో ఆదివారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ రైతుబంధు పథకం గుట్టలకు, చెరువులకు ఇచ్చి దుర్వినియోగం చేశారన్నారు. రవీందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన మహాసభకు ముఖ్య అతిథులుగా డీసీఓ నాగేశ్వర్‌రావు, నోడల్ ఆఫీసర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి హాజరై రైతుబంధుపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహా సభకు హాజరైన రైతులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గుట్టలకు, హైవేలకు రైతు బంధు వేయడం ద్వారా సామాన్య ప్రజలకు, రైతులకు రైతు బంధు పథకంతో ఎలాంటి న్యాయం జరగలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ రైతుబంధు పేరుతో రాష్ట్రాన్ని అప్పుల్లో పడేశారని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా రైతుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి తెలుసుకొని రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని 5 నుంచి 10 ఎకరాలలోపు ఉన్న చిన్న, సన్న కారు రైతులకే రైతుబంధు ఇవ్వాలని అధికారులను కోరారు. సీఈఓ ఓం ప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, దుగ్యాల శ్రీను, నత్తి సుధాకర్, వీర్ల వెంకటరమణ, కంచె సతీష్ పాల్గొన్నారు.

అశోకకాలనీలో రామ మందిర నిర్మాణం

హన్మకొండ: హనుమకొండలోని అశోకకాలనీలో రామ మందిరం నిర్మించాలని కాలనీవాసులు నిర్ణయం తీసుకున్నట్లు కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సోమేశ్వర్ రావు, దేవాలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వెంకట రాజారెడ్డి తెలిపారు. హనుమకొండలోని కల్యాణి ఫంక్షన్ హాల్‌లో అశోక కాలనీ హిందూ బంధుమిత్రుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కాలనీలోని గాంధీ విగ్రహం సమీపంలో 400 గజాల స్థలాన్ని సేకరించి రామ మందిరం నిర్మించుకోవాలని తీర్మానించినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా వెంకట రాజారెడ్డి రూ.4 లక్షల విలువగల చెక్కును విరాళంగా అందజేశారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు వెంకట రాజారెడ్డి, చింత శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అశోకకాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి నర్సిరెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, దేవాలయ కమిటీ కార్యదర్శి కృష్ణారెడ్డి, కోశాధికారి సుధాకర్ స్వామి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలి

హసన్‌పర్తి: కౌలు రైతులకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాసభ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా పదెకరాల లోపు ఉన్న వారికి రైతుబంధు వర్తింపజేయాలని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రస్తుతం గుట్టలు, ఖాళీ స్థలాలు, వెంచర్లకు కూడా రైతుభరోసా పథకం వర్తింపజేస్తున్నట్లు డీసీఓ దృష్టికి తీసుకెళ్లారు. వారి పేర్లను రైతు బంధు జాబితా నుంచి తప్పించాలని కోరారు. అలాగే పంటలకు మద్దతు ధర కల్పించాలని సూచించారు. అ నంతరం డీసీఓ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. సొసైటీ చైర్మన్ మేర్గు రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సొసైటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శాయంపేట : తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. రాష్ట్ర క్యాబినెట్‌లో విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై సీఎం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులు సరైన మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తుందన్నారు.ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మడికొండ ప్రశాంత్, బొజ్జ హేమంత్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షకార్యదర్శులు ఇస్మాయిల్, సిద్ధార్థ, గణేష్, భరత్, సమీర్, మహేందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



ఆత్మకూరు : బోల్తా పడిన ఇసుక లారీ

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని నీరుకుళ్ల క్రాస్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్‌కు చెందిన సంపత్, వినయ్‌లు ద్విచక్రవాహనంపై ములుగు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో నీరుకుళ్ల క్రాస్ వద్ద జాతీయ రహదారి పై ద్విచక్రవాహనం అదుపు తప్పి కారును ఢీకొనడంతో సంపత్, వినయ్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఇసుక లారీ బోల్తా ఘటనలో ఒకరికి..

ఇసుక లారీ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన ఆత్మకూరు మండలం కటాక్షపూర్ శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ములుగు జిల్లా నుంచి ఇసుకలోడు చేసుకొని లారీ హైదరాబాద్ వైపు వెళ్తుండగా కటాక్షపూర్ శివారులో జాతీయ రహదారిపై లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

పంథిని శివారులో ద్విచక్ర వాహనదారుడికి..

ఐనవోలు : ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పంథిని శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూర్‌కు చెందిన ప్రశాంత్ వరంగల్ నుంచి తొర్రూర్‌కు ఆదివారం బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్–ఖమ్మం రహదారి పంథిని శివారుకు చేరుకుని బ్రిడ్జి దాటుతున్న క్రమంలో అదుపు తప్పి బ్రిడ్జి గోడను ఢీకొట్టి కిందపడిపోయాడు. ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దామెర : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. 2000–01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 23 ఏళ్ల తరువాత మండలంలోని దుర్గంపేట్ సమీపంలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ మిత్రులందరూ కలుసుకోగానే ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి మధురజ్ఞాపకాలను నెమరువేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, రమేశ్, జనార్దన్, పరిపూర్ణచారి, కమలాకర్, శ్రీనివాసరావు, జలంధర్ రెడ్డి, ఆగయ్య, సాంబయ్య, కంటయ్య, రాజేంద్రప్రసాద్,గోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు మాదారపు రఘు, రజినీకాంత్, కొడకండ్ల శ్రీను, కల్పన, శ్రీను, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో అరెస్టులా?




సమావేశంలో మాట్లాడుతున్న బైరపాక ప్రశాంత్

హన్మకొండ: అక్రమ అరెస్టులు, నిర్బంధాలు విధించడమే ప్రజాపాలనా అని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ప్రశ్నించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయాలని అడిగితే అరెస్టు చేస్తారా, ఇదెక్కడి న్యాయమన్నారు. శనివారం సీఎం పర్యటన సందర్భంగా విద్యార్థి నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. నిరుద్యోగులకు ఉద్యోగ క్యాలెండర్, గ్రూప్ –2, గ్రూప్–3లో పోస్టులు పెంచుతామన్న హామీ ఏమైందని అన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన తీరుగానే నిరుద్యోగ, విద్యార్థి సమస్యలపై పోరాడుతామని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర్ల మనోజ్ కుమార్, నాయకులు లంక రాజ్‌గోపాల్, గంధ్రకోట రాకేష్ యాదవ్, పిల్లల నాగరాజ్, గొల్లపల్లి వీరస్వామి, టీజేఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పబ్బోజు శ్రీకాంత్ చారి పాల్గొన్నారు.

రజక జాతి అభివృద్ధికి పాటుపడుదాం

కాజీపేట అర్బన్: అన్నిరంగాల్లో వెనుకబడిన రజక జాతి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య సూచించారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలోని చాకలి ఐలమ్మ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా రజక ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ జనరల్ బాడీ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై సారయ్య మాట్లాడారు. రజక ఉద్యోగుల సంక్షేమానికి సంఘం కృషి చేయాలన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి



మాట్లాడుతున్న మోర్తాల చందర్‌రావు

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలపై పోరాడాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు సూచించారు. హనుమకొండలోని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నియంత్రించడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే గ్రామీణ ప్రాంతాలకు కూడా కార్పొరేట్ పాఠశాలలు విస్తరించాయని ధ్వజమెత్తారు. దాంతో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 29న వరంగల్ పర్యటనలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిని సీఎం ప్రారంభిస్తూ ప్రభుత్వ వైద్యం గురించి మాట్లాడడం శోచనీయమని అన్నారు. యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. సమావేశంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోతు రాజేష్‌నాయక్, బాధ్యులు రంగస్వామి, చందగణేష్, సంజయ్, నగేష్, వెంకట్, వీరబాబు, రాకేష్, మంగేష్, వంశీ, ప్రవీణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ విభాగం అధిపతి బాధ్యతలు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ మసూద్ అహ్మద్ మహమూదికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. హైదరాబాద్‌లోని ఓయూలో ఫిజిక్స్ విభాగంలో పరిశోధకుడు మసూద్ అహ్మద్.. ×ఫిజికల్ ఆప్టికల్ స్ట్రక్చరల్ అండ్ బయోయాక్టివ్ స్టడీస్ ఆఫ్ మిక్స్‌డ్ అల్కాలి బోరోసిలికెట్ క్యాల్షియం జింక్ గ్లాసెస్₹ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ లక్ష్మణ్ పర్యవేక్షణలో అహ్మద్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఆయన వరంగల్ ప్రాంతానికి చెందినవారు. డాక్టరేట్ పొందిన మహమూదిని కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.